రంజాన్‌కు సర్కారు మొండిచెయ్యి

- మైనార్టీల ప్రతినిధి కరీం అన్సారీ

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఈ ఏడాది రంజాన్ ఏర్పాట్లకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచెయ్యి చూపిందని మైనార్టీ వర్గాల ప్రతినిధి, సమాచార హక్కు కార్యకర్త కరీం అన్సారీ వెల్లడించారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మైనార్టీ శాఖ నుంచి నిధులేమైనా కేటాయించారా? అని సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నించడంతో ఎలాంటి నిధులు కేటాయించలేదని ప్రభుత్వం స్పష్టం చేసిందని వివరించారు. దీంతో రాష్ట్రంలోని ఇతర మతాలకు చెందిన కార్యక్రమాలకు కూడా ఇదే పద్ధతిని పాటించాలని ఎక్స్ (ట్విట్టర్) ద్వారా ప్రభుత్వానికి సూచించారు. ఆ ట్వీట్‌కు సీఎం రేవంత్‌రెడ్డిని, ముఖ్యమంత్రి కార్యాలయాన్ని, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీని ట్యాగ్ చేశారు.

హైకోర్టుకు కొత్తగా ఇద్దరు న్యాయమూర్తులు

ఢిల్లీ, మార్చి 18 (నమస్తే తెలంగాణ): వేర్వేరు హైకోర్టులకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేస్తూ కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించాక రాష్ట్రపతి ఈ మేరకు బదిలీలను ఖరారు చేసినట్టు తెలిపింది. మధ్యప్రదేశ్ హైకోర్టుకు చెందిన జస్టిస్ సుజయ్ పాల్, కలకత్తా హైకోర్టుకు చెందిన జస్టిస్ మౌశుమి భట్టాచార్య తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయ్యారు. న్యాయవాదిగా ఉన్న తన కుమారుడు మధ్యప్రదేశ్ హైకోర్టులో ప్రాక్టీసు చేస్తున్నందున తనను ఇక్కడి నుంచి బదిలీ చేయాలని జస్టిస్ సుజయ్ పాల్ ఫిబ్రవరి 12న సుప్రీంకోర్టు కొలీజియంకు విజ్ఞప్తి చేశారు. జస్టిస్ మౌశుమీ భట్టాచార్య కూడా వ్యక్తిగత కారణాల రీత్యా తనను కూడా బదిలీ చేయాలని కోరారు. మరింత మెరుగైన న్యాయ ప్రయోజనాల కోసం జస్టిస్ సుజయ్‌పాల్‌ను, జస్టిస్ మౌశుమీ భట్టాచార్యను బదిలీ చేయాలని సిఫారసు చేసినట్టు సుప్రీంకోర్టు కొలీజియం తెలిపింది. కొలీజియం సిఫారసులకు అనుగుణంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల అయ్యింది.

ఉరి తీయాలన్నవారే కండువా కప్పుతారా?

పార్టీ మారిన 24 గంటల్లో అనర్హత వేటు వెయ్యాలి

- ఎవ్వరూ తప్పించుకోలేరు
- ఫిరాయింపులపై సుప్రీం సీరియస్‌గా ఉన్నది
- రాజీవ్‌గాంధీపై గౌరవం ఉంటే ఫిరాయింపులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించకూడదు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా ఉద్యమకారులే
- కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్

సోమవారం మీడియాతో మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపుదారులపై పార్టీ మారిన 24 గంటల్లోనే స్పీకర్ అనర్హత వేటు వేయాలని బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. మహారాష్ట్ర కేసు విషయంలో సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారిపై స్పీకర్ త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. పార్టీ మారే వాళ్లను ఉరితీసే చట్టం చేయాలని, ఆ విధంగా రాజ్యాంగంలో చేర్చాలని వ్యాఖ్యానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఫిరాయింపుదారులకు కండువాలు ఎలా కప్పుతున్నారని ప్రశ్నించారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు చాలా సీరియస్‌గా ఉన్నదని, అనర్హత వేటు నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరని హెచ్చరించారు. మహారాష్ట్రలో పార్టీ ఫిరాయింపుదారుల అనర్హతల అంశంపై స్పీకర్ త్వరగా నిర్ణయం తీసుకోవాలని, పార్టీ మారిన రోజునుంచే వారిని అనర్హులుగా భావించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. పార్టీ ఫిరాయింపుదారులపై 'త్వరగా నిర్ణయం తీసుకోవాలని' రాజ్యాంగంలో ఉన్నదని వివరించారు. తాము కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చబోమని చెప్పినా, వారికి వారే మాట్లాడుకొని ఫిరాయింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రతిపక్ష పాత్ర ఒక వరం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష పాత్ర చాలా గొప్పదని, అదొక వరంగా భావించి ప్రజలకు సేవల చేయాలని బీ వినోద్‌కుమార్ కోరారు. బీఆర్‌ఎస్ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్లిన ఎంపీలు ఏ ప్రయోజనం ఆశించి వెళ్లారని ప్రశ్నించారు. ఏ పార్టీ అయినా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం తప్పని స్పష్టంచేశారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 1985లో రూపొందించారని, ఆయన మీద ఏ మాత్రం గౌరవం ఉన్నా కాంగ్రెస్ నేతలు ఫిరాయింపులను ప్రోత్సహించకూడదని హితవు చెప్పారు. ఒక పార్టీ నుంచి గెలిచినోడు మరో పార్టీలో చేరకుండా అనర్హత వేటు వేయాలని చెప్పిన రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని సూచించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అందరూ ఉద్యమకారులేనని పేర్కొన్నారు. కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో దొరికిన డబ్బుకు నిర్వాహకులే లెక్కలు చెప్పుకుంటారని, వారు తనకు బంధువులైనంత మాత్రాన తన మీద నిరాధార ఆరోపణలు చేస్తారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు దేవీప్రసాద్ పాల్గొన్నారు.

సోమవారం యాదాద్రి లక్ష్మీనృసింహుని కల్యాణ ఘట్టాన్ని కళ్లారా వీక్షించేందుకు అశేషంగా తరలివచ్చిన భక్తజనంతో కళకళలాడుతున్న ఆలయ ప్రాంగణం

వైభవంగా యాదగిరీశుడి కల్యాణోత్సవం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట, మార్చి 18: యాదగిరీశుడి కల్యాణోత్సవాన్ని సోమవారం రాత్రి 8:45 గంటలకు నిర్వహించారు. స్వామి గజ వాహనంపై, అమ్మవారిని పుష్పాల పల్లకిలో కల్యాణ వేదికకు తీసుకొచ్చారు. కల్యాణ మహోత్సవాన్ని ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు నిర్వహించారు. ప్రభుత్వం తరఫున ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు, ఆలయం తరఫున అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,

దానంపై అనర్హత వేటు వేయాలి

మొదటిపేజీ తరువాయి...

వెంకటేశ్, ముఠా గోపాల్, బండారి లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు స్పీకర్‌ను కలిశామని, ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరామని తెలిపారు. ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం రాజ్యాంగాన్ని గౌరవిస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఫిరాయింపులపై స్పీకర్ మూడు నెలల్లోనే నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, దాని ప్రకారం దానంపై అనర్హత వేటు పడటం ఖాయమని చెప్పారు. ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీలోకి వెళ్లటం సమంజసం కాదని అన్నారు. రేవంత్‌రెడ్డి గతంలో పార్టీ మారిన వాళ్లని రాళ్లతో కొట్టండి అని చెప్పాడని, ఇప్పుడు తాము ఆ మాట అనడంలేదని, ఆయనకు గుర్తు చేస్తున్నామని చెప్పారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు ఏం సమాధానం చెప్తారని నిలదీశారు. ఇదే రేవంత్‌రెడ్డి.. దానం నాగేందర్‌ను పంజాగుట్ట బార్ దగ్గర బీడీలు అమ్ముకునే వాడని అన్నాడని, బీడీలు అమ్ముకు నేటోన్ని ఇప్పుడు కాంగ్రెస్‌లో ఎందుకు చేర్చుకున్నారని ప్రశ్నించారు. నోరు ఉందని ఏది పడితే అది మాట్లాడటం సరికాదన్నారు. సింహం ఒక అడుగు వెనుకకు వేసింది అంటే.. నాలుగు అడుగులు ముందుకు వేయడానికేనని గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించారు. 'రేవంత్‌రెడ్డి.. దానంను చేర్చుకునే సమయంలో బాగా నవ్వుతున్నావు, నువ్వు కొట్టావు.. మేము తీసుకున్నాం... మేము కొట్టినప్పుడు నువ్వు లేవలేవు' అని కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. 'మీరు గేట్లు తెరిచామని అంటున్నారు.. మేము గేట్లు తెరిచినప్పుడు మీరు భూస్థాపితం అవుతారు. గేట్లు తెరిస్తే ఎలా ఉంటుందో చూపిస్తాం' అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేండ్లు కొనసాగాలని తాము కోరుకుంటున్నామని, రేవంత్‌రెడ్డి ఐదేండ్లు సీఎంగా ఉండొచ్చని, కాంగ్రెస్‌లో జరిగే అంతర్గత కలహాలకు తాము భాద్యులం కాదని స్పష్టం చేశారు. ఖమ్మం, నల్లగొండ కాంగ్రెస్ బాంబులు ఎప్పుడైనా పేలొచ్చని కౌశిక్‌రెడ్డి అనుమానం వ్యక్తంచేశారు.

ఆ ఇద్దరి బాగోతం బయటపెడతా

- ఆర్థిక ప్రయోజనాల కోసమే జితేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక
- బీజేపీ నేత రఘునందన్‌రావు

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఆర్థిక ప్రయోజనాల కోసమే మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారని బీజేపీ నేత రఘునందన్‌రావు విమర్శించారు. వారి ఆర్థిక ప్రయోజనాల చిట్టా రెండు రోజుల్లో బయటపెడతానని హెచ్చరించారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. షేక్‌పేటలోని సర్వే నెంబర్ 343, 403లో అక్రమ నిర్మాణాలపై పూర్తి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ గుట్టలు, గుడులను మింగినోళ్లనే పార్టీలోకి చేర్చుకున్నారని మండిపడ్డారు. జితేందర్‌రెడ్డికి సిద్ధాంతాల గురించి మాట్లాడే అర్హత లేదని చెప్పారు. కొడుకుకు సీటు ఇవ్వకపోతే సిద్ధాంతాలు లేనట్టా? అని ప్రశ్నించారు. అందితే జుత్తు అందకపోతే కాళ్లు అన్నట్టుగా ప్రధాని మోదీ పట్ల రేవంత్ తీరు ఉన్నదని ఎద్దేవా చేశారు.

రంజిత్‌రెడ్డిది నయ వంచన

- వంద కోట్లకు కాంగ్రెస్ టికెట్ కొన్నారు
- బీఆర్‌ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరడం నయవంచన, దగా, వెన్నుపోటు అని బీఆర్‌ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. రంజిత్‌రెడ్డికి కేసీఆర్ రాజకీయ భిక్ష పెడితే ఎంపీ అయ్యారని, ఆయన ఎదుగుదలకు బీఆర్‌ఎస్సే కారణమని చెప్పారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ అధికారం నుంచి దూరం కాగానే రంజిత్‌రెడ్డి పార్టీకి దూరమవుతారా? అని ప్రశ్నించారు. కష్టకాలంలో కేసీఆర్‌కు అండగా ఉండాల్సిందిపోయి వెన్నుపోటు పొడుస్తారా? అని మండిపడ్డారు. చేవేళ్ల కాంగ్రెస్ టికెట్‌ను రంజిత్‌రెడ్డి వంద కోట్లకు కొన్నారని కాంగ్రెస్ కార్యకర్తలు చర్చించుకుంటున్నారని చెప్పారు. తనకు మరోసారి ఎంపీగా పోటీ చేసే ఉద్దేశం లేదని, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని రంజిత్‌రెడ్డి చెప్తే కేసీఆర్ నమ్మారని, ఆ నమ్మకాన్ని రంజిత్‌రెడ్డి వమ్ము చేశారని మండిపడ్డారు. చేవేళ్లలో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని, రంజిత్‌రెడ్డికి ఓటమి తప్పదని చెప్పారు.

చట్ట ప్రకారమే డిస్కంలకు ఉత్తర్వులు

- ప్రజా ప్రయోజనాల రీత్యానే 'గృహజ్యోతి'కి ఆమోదం
- జీరో బిల్లుల సబ్సిడీని విడుదల చేస్తామని ప్రభుత్వమే చెప్పింది
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపణలపై ఈఆర్సీ వివరణ

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 'గృహజ్యోతి' పథకం అమలుపై విద్యుత్తు నియంత్రణ చట్టం ప్రకారమే ఉత్తర్వులిచ్చామని తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ) తెలిపింది. విద్యుత్తు చట్టం-2003లోని సెక్షన్ 108 ప్రకారం.. విద్యుత్తు పంపిణీ సంస్థలకు ముందుగా అడ్వాన్స్ చెల్లించిన తర్వాతే జీరో బిల్లులు జారీచేయాల్సి ఉన్నదని, ఈ నేపథ్యంలో డిస్కంలకు సుమోటోగా డిస్కంలకు ఆదేశాలిచ్చామే తప్ప ప్రభుత్వానికి కాదని స్పష్టం చేసింది. విద్యుత్తు చట్టం-2003లోని సెక్షన్ 63 ప్రకారం.. గృహజ్యోతి లబ్ధిదారులకు జారీచేస్తున్న జీరో బిల్లుల సబ్సిడీని తామే విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా లేఖ రాసిందని, దీనినే ఉత్తర్వుల్లో ప్రస్తావించామని పేర్కొన్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఈఆర్సీ చైర్మన్ తన్నీరు రంగారావుపై పలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఈఆర్సీ సోమవారం ఓ ప్రకటన ద్వారా ఈ వివరణ ఇచ్చింది.

ప్రజా ప్రయోజనాల దృష్ట్యానే..

పక్షపాతం లేకుండా చిత్తశుద్ధితో విధులను నిర్వర్తిస్తున్నామని, తమ నిబద్ధతను ఎవరూ శంకించలేరని ఈఆర్సీ పేర్కొన్నది. రైతుల ఉచిత విద్యుత్తు కనెక్షన్లకు మీటర్లు లేక వినియోగాన్ని రికార్డు చేయడం లేదని, అందుకే డిస్కంలు జీరో బిల్లులు జారీచేయకుండా 6 నెలలకోసారి కస్టమర్ చార్జీల ప్రకారం విద్యుత్తు బిల్లులను జారీచేస్తున్నాయని వెల్లడించింది. ఎస్సీ, ఎస్టీలతోపాటు క్షౌరశాలలు, లాండ్రీలు, ధోబీ ఘాట్లకు కూడా జీరో బిల్లులు జారీచేయడం లేదని, రీయింబర్స్‌మెంట్ ద్వారా వచ్చిన మొత్తానికే బిల్లు మొత్తాన్ని తీస్తోందని తెలిపింది. 'గృహజ్యోతి'కి సంబంధించి తామిచ్చిన ఆదేశాలపై అభ్యంతరాలుంటే కమిషన్ ముందు అప్పీలు చేసుకోవచ్చని ఈఆర్సీ తెలిపింది.

తెలంగాణకు ఎల్లో అలర్ట్

- నాలుగురోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు
- 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- పలు జిల్లాల్లో పిడుగులు పడే అవకాశముందన్న అధికారులు
- భారత వాతావరణ శాఖ హెచ్చరిక

సిరిసిల్ల అర్బన్ పెద్దూరు కాశీనగర్‌లో గాలిదుమారానికి ఎగిరి కింద పడ్డ ఇంటి పైకప్పు రేకులు

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): మండే ఎండలతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లని వార్త చెప్పింది. రాష్ట్రంలో వచ్చే నాలుగు రోజులపాటు ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోపాటు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్టు పేర్కొన్నది. కొన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, వికారాబాద్, వనపర్తి, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో వానలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం పలు జిల్లాలతోపాటు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వానలు కురిశాయి.

కొనసాగుతున్న ద్రోణి

మహారాష్ట్ర నుంచి కర్ణాటక వీదుగా ఉత్తర కేరళ వరకు ద్రోణి కొనసాగుతున్నట్టు ఐఎండీ తెలిపింది. భారీ వర్షాలు కురిసే జిల్లాల్లో విద్యుత్తు స్తంభాలు, చెట్లు నేలకూలడం, రవాణా వ్యవస్థ స్తంభించడం వంటివి చోటుచేసుకోవచ్చని హెచ్చరించింది. రాష్ట్రంలో శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు తొమ్మిది జిల్లాల్లో వందకు పైగా ప్రాంతాల్లో వర్షాలు కురిసినట్టు వాతావరణ శాఖ తెలిపింది. అత్యధికంగా కామారెడ్డి జిల్లా సదాశివనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలాల్లో 5 సెం.మీ., కరీంనగర్‌లో 4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కామారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో వడగండ్ల వానలు పడ్డాయి. వర్షాలతో రాష్ట్రమంతటా ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు నుంచి నాలుగు డిగ్రీల వరకు తగ్గుముఖం పట్టాయి. వడగండ్ల వానల కారణంగా కోతకు వచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. ఉద్యాన పంటలు నేల రాలాయి. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు పంటల నష్టాన్ని అంచనా వేయనున్నాయి.

వడగండ్ల వాన బీభత్సం

- సిరిసిల్ల జిల్లాలో కరెంట్ పోల్ విరిగిపడి కూలీ మృతి
- స్తంభాలపై కూలిన చెట్లు.. విద్యుత్తు సరఫరాకు బ్రేక్

రాజన్న సిరిసిల్ల, మార్చి 18 (నమస్తే తెలంగాణ): రాజన్న సిరిసిల్ల జిల్లాలో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ముస్తాబాద్‌లో చెట్టు కొమ్మలు కూలి విద్యుత్తు స్తంభంపై పడటంతో అది విరిగి వ్యవసాయ కూలీలపై పడింది. తీవ్రంగా గాయపడిన ఒకరు దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందారు. జిల్లాలో పలు చోట్ల సోమవారం సాయంత్రం 6.30 గంటలకు మొదలైన వడగండ్ల వాన అరగంటపాటు కురిసింది. గాలిదుమారానికి సిరిసిల్ల అర్బన్ మండలం పెద్దూరులోని కాశీనగర్‌లో విద్యుత్తు వైర్లు తెగి కిందపడ్డాయి. ఓ ఇంటి పైకప్పు రేకులు కొట్టుకుపోయి వంద మీటర్ల దూరంలో ఎగిరిపడ్డాయి. చెట్ల కొమ్మలు విరిగి పడి విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. ముస్తాబాద్‌లోని కొత్త బస్టాండ్‌లో స్తంభం విరిగి చెట్టు కింద నిలబడిన ఇద్దరు వ్యవసాయ కూలీలపై పడటంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్ర గాయాలపాలైన ఎల్సాని ఎల్లయ్యను చికిత్స కోసం అంబులెన్సులో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి రాత్రి 10 గంటల ప్రాంతంలో చనిపోయాడు. ఎల్లయ్య వ్యవసాయ కూలీ. ఆయనకు భార్య రేణుక (55), కొడుకు, కూతురు ఉన్నారు.

కరెంట్ కాటుకు రైతు బలి

- మోటారు విద్యుత్తు తీగ తగలడంతో షాక్
- మహబూబాబాద్ జిల్లా తాళ్ల తండాలో విషాదం

గూడూరు, మార్చి 1: వ్యవసాయ బావిలో ఉన్న మోటార్‌ను చూసేందుకు దిగిన రైతు విద్యుదాఘాతానికి గురై మరణించాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు గ్రామపంచాయతీ పరిధిలోని తాళ్లతండాలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మాలోత్ మాన్‌సింగ్ (55) సోమవారం ఉదయం వరి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. బావిలో ఉన్న మోటార్ ఆన్‌చేయగా లెవల్ లేక ఆగిపోయింది. లెవల్ పోసి తిరిగి ఆన్ చేసినా నీళ్లు పోయకపోవడంతో మోటారును పరిశీలించేందుకు బావిలోకి దిగాడు. ఈ క్రమంలో షార్ట్‌సర్క్యూట్‌కు గురై బావిలో పడిపోయాడు. గమనించిన మాన్‌సింగ్ సోదరుడు లాల్‌సింగ్ ఇతర రైతుల సాయంతో విద్యుత్తు సరఫరాను నిలిపివేసి మాన్‌సింగ్‌ను దవాఖానకు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి రెండో సోదరుడు రాజారాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రైతుకు భరోసా కరువు

- కరువుపై స్పందించని ప్రభుత్వం
- నష్టంపై సర్వేకు చర్యలు శూన్యం
- అకాల వర్షాలతో మరింత నష్టం

హైదరాబాద్, మార్చి 18(నమస్తే తెలంగాణ): సాగునీళ్లు వస్తాయని గంపెడాశలతో యాసంగి సాగు చేసిన రైతుల బతుకు ఆగమైంది. ప్రాజెక్టుల నీళ్లు వదలక పంటలన్నీ ఎండిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటి బోర్లన్నీ వట్టిపోయాయి. కరువు కోరల్లో చిక్కుకుని అన్నదాతలు విలవిలలాడుతున్నారు. ఎండిన పంటలు పోను పొట్ట దశకు వచ్చిన వరిపంటనైనా ఇంటిని తీసుకెళ్తామనుకున్న రైతుపై ప్రకృతి పగ పట్టింది. అకాల వర్షాలతో నోటి కాడి బుక్కను కూడా నేలరాల్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో సుమారు 66 లక్షల ఎకరాల్లో పంటలు సాగైంది. ఇందులో 51 లక్షల ఎకరాల్లో వరి సాగు ఉంది. ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేకపోవడంతో యాసంగి పంటలకు నీళ్లు కరువయ్యాయి. సాగు నీటి కొరతతో ఇప్పటికే సుమారు 15 లక్షల ఎకరాల్లో వరి పంట ఎండిపోయినట్లు అంచనాలు ఉన్నాయి. ఇది మరో 10 లక్షలు పెరిగే అవకాశం ఉంది. ఎండిన పంటలకు కొందరు రైతులు నిప్పు పెడుతుంటే మరికొందరు రైతులు పశువులను మేపుతున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు ఆదివారం కురిసిన వడగండ్ల వర్షాలతో పలు జిల్లాల్లో భారీ విస్తీర్ణంలో వరి పంట, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి.

సర్కారు మొద్దు నిద్ర

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతుకు ప్రభుత్వ భరోసా కరువైంది. పంట నష్టపరిహారం ఇచ్చైనా ఆదుకోవాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇప్పటి వరకు పంట నష్టాన్ని అంచనా వేసిందీ లేదు. కనీసం నిండా మునిగి కన్నీరు కారుస్తున్న రైతును పలుకరించిన నాథుడే లేదు. ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటి వరకు పంట నష్టంపై సర్వే చేయలేదు. సమీక్ష కూడా చేయలేదు. ఇప్పటికైనా పంట నష్టం అంచనాకు సర్వే చేయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కేంద్ర జల సంఘం వ్యాఖ్యలు దారుణం

- కృష్ణాలో తెలంగాణ ఎక్కువ నీటిని వాడుకుంటుందనడం అన్యాయం
- కాంగ్రెస్ నేత డీకే సమరసింహారెడ్డి

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): కృష్ణానదిలో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటా దక్కడం లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి డీకే సమరసింహారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తెలంగాణ రాష్ట్రం కృష్ణానీటిని ఎక్కువగా వాడుకుంటుందని చెప్పడం తీవ్ర అభ్యంతరకరమని మండిపడ్డారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డితో కలిసి గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణానదిలో మొత్తం 800 టీఎంసీల నీటిలో తెలంగాణ వాటా 65 శాతమని గుర్తు చేశారు. రాష్ట్రానికి కేటాయించిన నీటినే తెలంగాణ వాడుకోవడం లేదని, అలాంటప్పుడు ఎక్కువ నీటిని వాడుకుంటుందని సీడబ్ల్యూసీ ఏ ఆధారంతో చెప్తున్నదని ప్రశ్నించారు.

కేటాయించిందే వాడుకోవడం లేదు..

తెలంగాణకు కేటాయించిన నీటినే సరిగ్గా వాడుకోలేపోతుండగా, కేటాయించిన దానికంటే నాలుగు టీఎంసీల నీటిని అదనంగా వాడుకుంటుందని సీడబ్ల్యూసీ చెప్పడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించాలని సూచించారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కూడా కోరనున్నట్టు సమరసింహారెడ్డి తెలిపారు. కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన దానికంటే ఎక్కువ నీటిని వాడుకుంటుందని సీడబ్ల్యూసీ చెప్పడం దారుణం అన్నారు. కృష్ణా జలాల పంపిణీపై తొలిసారి ఏర్పాటు చేసిన బచావత్ ట్రిబ్యునల్ న్యాయంగా పంపకాలు చేసిందని గుర్తుచేశారు. కానీ, బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ వచ్చాక తెలంగాణకు అన్యాయం చేసిందని విమర్శించారు. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ సిఫారసులను పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

సాగర్‌పై ఆంక్షలు

మొదటిపేజీ తరువాయి...

లేఖలు రాసింది. నాగార్జునసాగర్ డ్యాం కుడిగట్టు విద్యుత్తు కేంద్రం ఏపీ ఆధీనంలో.. ఎడమగట్టు, ప్రధాన విద్యుత్ కేంద్రం తెలంగాణ ఆధీనంలో ఉన్నాయి. ఆయా పవర్‌హౌజ్‌లకు సంబంధించి రోజువారీతోపాటు, వారం, నెల, సీజన్ వారీగా మెయింటనెన్స్ పనులతోపాటు, సీజన్‌వారీగా మరమ్మతులను గుర్తించి అందుకు సంబంధించిన పనులు సైతం నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఇది ఎలాంటి ఆటంకం లేకుండానే కొనసాగింది. నవంబర్ 30న ఏపీ డ్యాం కుడివైపు భాగాన్ని అప్రజాస్వామికంగా ఆక్రమించుకోవడం, ఆపై కేంద్రం జోక్యం చేసుకొని ప్రాజెక్టును స్వాధీనం చేసుకుని సీఆర్పీఎఫ్ బలగాలను మోహరించింది. డ్యాం నుంచి నీటి విడుదలతోపాటు ఇరు రాష్ట్రాల అధికారుల రాకపోకలపై ఇప్పటికే ఆంక్షలు విధించింది. కేంద్రజలశక్తి విధించిన నిబంధనల మేరకు కేఆర్‌ఎంబీ బోర్డు అనుమతి పొందిన తరువాతే ఇరు రాష్ట్రాల అధికారులను సీఆర్పీఎఫ్ బలగాలు డ్యాంపైకి అనుమతిస్తాయి. పవర్‌హౌస్‌ల నిర్వహణపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. మరోవైపు, పవర్‌హౌజ్‌లకు సంబంధించి నీటిని తీసుకెళ్లే గేట్లు (పెన్‌స్టాక్ గేట్లు), సాధారణ, ఎమర్జెన్సీ మెయింటెనెన్స్ పనులకు సైతం ఆటంకం ఏర్పడుతున్నది. ఈ నేపథ్యంలో ఇటీవల తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సాగునీటిపారుదలశాఖ, జెన్‌కో అధికారులు కేఆర్‌ఎంబీకి లేఖ రాశారు. పనుల నిర్వహణకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో గత నెల 23న ఇరు రాష్ట్రాలకు సంబంధించిన ఇరిగేషన్, జెన్‌కో అధికారులతోపాటు, కేఆర్‌ఎంబీ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. పవర్‌హౌజ్‌లను పరిశీలించడంతోపాటు అక్కడే సంయుక్త సమావేశం నిర్వహించింది. వారానికి ఒకసారి పెన్‌స్టాక్ ఇన్‌టేక్ గేట్ల రెగ్యులర్, సాధారణ నిర్వహణ అవసరమని, అదేవిధంగా పరికరాల మార్పు, నిర్వహణ, మరమ్మతు, మెకానిజం రీప్లేస్‌మెంట్ తదితర ప్రత్యేక పనులను ముందస్తుగా ప్లాన్ చేసుకోవచ్చని నిర్ణయించింది. పెన్‌స్టాక్ గేట్లకు సంబంధించిన అత్యవసర పనులేవైనా పిగ్ మెకానిజం, టర్బైన్, నిర్వహణ లోపాలను నివారించేందుకు వెంటనే మరమ్మతులు చేయాల్సి ఉంటుందని, అందుకు సంబంధించి కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించింది. ఈ నేపథ్యంలో పవర్‌హౌజ్‌లకు సంబంధించి ఆయా పనుల నిర్వహణకు కేఆర్‌ఎంబీ తాజాగా అనుమతులు మంజూరు చేసింది. మరోవైపు, తెలంగాణ, ఏపీ జెన్‌కో అధికారులకు డ్యామ్‌పై రాకపోకలు సాగించేందుకు ఆంక్షలతో కూడిన అనుమతులు మంజూరు చేసింది.

కేఆర్‌ఎంబీ ఆదేశాలు ఇలా

- పెన్‌స్టాక్ ఇన్‌టేక్ గేట్లు, సంబంధిత మెకానిజం రెగ్యులర్/రొటీన్ నిర్వహణ పనుల నిర్వహణకు వారానికి ఒక రోజు, అదీ ప్రతి బుధవారం మాత్రమే అనుమతి ఉంటుంది. బుధవారం ప్రభుత్వ సెలవుదినం అయితే మరుసటి రోజున ఆ పనులు చేపట్టుకోవచ్చు. పనుల నిర్వహణకు గరిష్ఠంగా నలుగురు ఇంజినీర్లతో పాటు ఆరుగురు సిబ్బంది/కార్మికులను రెండు వాహనాల్లోనే అనుమతిస్తారు.
- షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సిన పనులను పూర్తిచేసేందుకు సంబంధిత రాష్ట్ర అధికారులు కేఆర్‌ఎంబీ నుంచి అనుమతిని పొందాలి. పని వివరాలు, పూర్తిచేసేందుకు పట్టే కాలం, అవసరయ్యే కార్మికుల సంఖ్య మొదలైనవాటిని బోర్డుకు తెలపాలి.
- పీఐజీపై అత్యవసర పనుల నిర్వహణకు సంబంధించి కేఆర్‌ఎంబీకి సమాచారం ఇచ్చిన తరువాతే ఇంజినీర్లు, సిబ్బందితో సహా 10 మంది వరకే వన్-టైమ్ ప్రాతిపదికన జెన్‌కో స్టేషన్ ఇన్‌చార్జి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్/డివిజనల్ ఇంజినీర్ స్థాయికి తక్కువ కాకుండా అనుమతి ఇవ్వొచ్చు.
- నాగార్జునసాగర్ కుడిగట్టు విద్యుత్తుకేంద్రం పిగ్-1లో పెండింగ్‌లో ఉన్న పనులకు హాజరు కావడానికి కాంట్రాక్టర్లు ఎంఏ మజార్, ఎస్‌వీ రమణకు అనుమతులు మంజూరుచేశారు. మొదటి కాంట్రాక్టర్‌కు మొదట్లో ఒక నెల వ్యవధి అంటే 15-04-2024 వరకు గరిష్ఠంగా 10 మంది కార్మికులను ఒక వాహనంతో పాటు అనుమతిస్తారు. ఆ పనులను పర్యవేక్షించేందుకు ఆరుగురు ఏపీ జెన్‌కో ఇంజినీర్లతో పాటు ఆరుగురు సిబ్బందిని 3 వాహనాలతో అనుమతిస్తారు.
- కార్మికులు, వాహనాల జాబితా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్/డివిజనల్ ఇంజినీర్ క్యాడర్ కంటే తక్కువ కాకుండా స్టేషన్ ఇన్‌చార్జి ద్వారా ధ్రువీకరించాలి.
- ఇచ్చిన అనుమతులు మూడు నెలల వ్యవధిలో అంటే 15-06-2024 వరకు అదీ షరతుల మేరకే అమలవుతాయి.
- తెలంగాణ, ఏపీ సంబంధిత అధికారుల నిర్దిష్ట అభ్యర్థన ఆధారంగా పిగ్‌కు సంబంధించిన పనులను నిర్వహణకు అనుమతి జారీచేసిన నేపథ్యంలో పనులకు అనుమతించిన వ్యక్తుల గుర్తింపు, ప్రామాణికతను పాటించాల్సిన బాధ్యత సంబంధిత పవర్ స్టేషన్‌దేనని పేర్కొంది.
- పనుల సమయంలో సంభవించే ప్రమాదాలు, మెటీరియల్, పరికరాలు, పర్యవసానంగా జరిగే నష్టాలకు కేఆర్‌ఎంబీ బాధ్యత వహించదు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వాటికి పూర్తి బాధ్యత పనులు చేస్తున్న సంబంధిత అధికారులదే.
- పురుషులు, మెటీరియల్, ఎక్విప్‌మెంట్ కదలిక కచ్చితంగా పెన్‌స్టాక్ ఇంటెక్ గ్యాలరీల పని ప్రదేశాలకు మాత్రమే పరిమితం చేస్తారు.